క్లుప్తంగా

చేతి పంపులకు మరమ్మతులు



చిట్టినగర్(విజయవాడపశ్చిమ): స్థానిక 48వ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఉన్న చేతి పంపులకు కార్పొరేషన్ సిబ్బంది బుధవారం మరమ్మతులు చేపట్టారు. డివిజన్‌లోని రాయప్పరాజు వీధి, అల్లా నాగయ్య వీధి, ఉప్పలపాటి రామచంద్రరాజు వీధి, గుండు రామారావు వీధి, సాధుజాన్ వీధుల్లో చేతి పంపులకు అవసరమైన మరమ్మతులు చేశారు. వేసవి నేపథ్యంలో ప్రజలకు నీటి ఇబ్బందులు కలుగకుండా చేతి పంపులకు మరమ్మతులు చేపట్టినట్లు సిబ్బంది తెలిపారు. డివిజన్‌లోని కొండ ప్రాంతాల్లో మొత్తం 14 చేతి పంపులకు మరమ్మతులు నిర్వహించినట్లు వారు వివరించారు.

అప్పు చెల్లించలేదని దాడి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): తీసుకున్న అప్పు చెల్లించలేదని ఇంటి మీదకు వెళ్లి దాడి చేసి గాయపరిచిన వ్యక్తిపై భవానీపురం పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాలు... భవానీపురం ఔట్ ఏజెన్సీకి చెందిన ఎస్.బుజ్జి అనే మహిళ తుళ్లిమెల్లి అనిల వద్ద గత నెల 14న రూ.20 వేలు అప్పుగా తీసుకుంది. ప్రతి రోజు రూ. 350 చెల్లించేలా ఒప్పందం చేసుకుంది. కొద్ది రోజులు బాగానే చెల్లించింది. ఆమె పరిస్థితి బాగోక 10 రోజులుగా డబ్బులు చెల్లించడం లేదు. దీంతో అనిల, ఆమె కూతురు అంజుర ఇద్దరు కలిసి బుజ్జి ఇంటికి వచ్చి డబ్బులు ఎప్పుడు ఇస్తావని నిలదీశారు.. తర్వాత ఇస్తానని చెప్పినా వినకుండా తనకు ఇప్పుడే డబ్బులు కావాలని, లేని పక్షంలో ఇంటిలో సామగ్రి తీసుకుని వెళ్లిపోతానని బెదిరించింది. ఆమె ఆర్థిక పరిస్థితి బాగోలేదని చెప్పినా వినకుండా బుజ్జిపై దాడి చేసింది. దాడిలో ఆమెకు తలపై, ఛాతిపై దెబ్బలు తగిలాయి. దీంతో బాధితురాలు జీజీహెచ్‌లో చేరింది. తనపై అనిల దాడి చేసిందని భవానీపురం పోలీసులకు ఫిర్యాదు చేయగా ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

కక్షిదారుల సౌలభ్యానికే మధ్యవర్తిత్వ కేంద్రాలు



విజయవాడలీగల్: కోర్టు కేసులతో ఇబ్బంది పడుతున్న వారికి అవగాహన కల్పించి, వారి గొడవలకు దారితీసిన అంశాలను సద్దుమణిగేలా చేసి, వారి మధ్య సత్సంబంధాలు నెలకొల్పేలా చేయడానికి మధ్యవర్తిత్వ కేంద్రాలు ఉపయోగపడతాయని ట్రైనర్ అరుణాచలం పేర్కొన్నారు. బెజవాడ కోర్టు కాంప్లెక్స్‌లో సోమవారం నుంచి జరుగుతున్న మీడియేషన్ శిక్షణ తరగతులలో భాగంగా కక్షిదారులతో ముఖాముఖిలో అరుణాచలం పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ధనం, కాలం వృథా కాకుండా వారి మధ్య సత్సంబంధాలు నెలకొనేలా చేయడం ముఖ్య ఉద్దేశమన్నారు. అనంతరం కక్షిదారులు ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు. కార్యక్రమంలో కృష్ణాజిల్లా మధ్యవర్తిత్వ కేంద్ర తొలిసభ్యుడు వేముల హజరత్తయ్యగుప్తా, న్యాయవాదులు ఝాన్సీరాణి, శివరామకృష్ణ, రాము, ఉషారాణి పాల్గొనగా, న్యాయసేవాధికార సంస్థ సిబ్బంది సహకరించారు.

విద్యార్థులకు చట్టాలపై అవగాహన అవసరం

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్):విద్యార్థులు ఉన్నత లక్ష్యాల సాధన దిశగా చక్కటి క్రమశిక్షణతో విద్య అభ్యసించాలని మూడో అదనపు జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఎస్.జ్యోతి విద్యార్థులకు సూచించారు. మండల న్యాయ సేవాధికారి సంస్థ ఆధ్వర్యంలో సత్యనారాయణపురంలోని రవీంద్ర భారతి స్కూల్‌లో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న న్యాయమూర్తి జ్యోతి మాట్లాడుతూ విద్యార్థులు చిన్న వయస్సు నుంచే చట్టాలపై అవగాహన కలిగి ఉండి, సత్ప్రవర్తతో చదువులో రాణించి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. న్యాయ సేవల అధికారి పగిడిపల్లి రాము, ఎస్ఎస్‌పురం ఉమెన్ ఎస్ఐ సౌజన్య, స్కూల్ ప్రిన్సిపాల్ హెప్సీబా పాల్గొన్నారు.

రేపు వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ ఆవిర్భావ దినోత్సవం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఈనెల 28న రాష్ట్ర వ్యాప్తంగా ఘనంగా నిర్వహించాలని ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి పిలుపునిచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల్లో ఆవిర్భావ వేడుకలు నిర్వహించి యూనియన్ జెండా ఆవిష్కరించాలని, మహానేత వైఎస్సార్‌కు పూలమాలలు వేసి నివాళులర్పించాలన్నారు. ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పేదలకు పండ్లు పంపిణీతోపాటు ఎక్కడికక్కడ సేవా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.

సర్వమానవ సౌభ్రాతృత్వానికి ప్రతీక

- నేడు భవానీపురం దర్గా 437వ ఉరుసు మహోత్సవం
- వేలాదిగా హాజరుకానున్న భక్తులు


భవానీపురంలోని హజరత్ సయ్యద్ గాలిబ్ షహీద్ దర్గా

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఏ మతానికి చెందినవారు ఆ మతానికి సంబంధించిన దేవుళ్లను, దేవతలను కొలుస్తుంటారు. మతాలెన్ని ఉన్నా దేవుడొక్కడే అని నమ్మేవారు అన్ని దేవాలయాలను దర్శించుకుంటుంటారు. తమ సమస్యలను, బాధలను విన్నవించుకుని, వాటిని తీర్చాలంటూ మొక్కుకుంటారు. ఆ కోవలోకే వస్తుంది..విజయవాడ భవానీపురంలోని హజరత్ సయ్యద్ గాలిబ్ షహీద్ దర్గా. 430ఏళ్లకుపైగా చరిత్ర ఉన్న ఈదర్గాకు రాష్ట్రం నలుమూలలనుంచి భక్తులు విచ్చేసి బాబా సమాధిని దర్శించుకుంటారు. అంతేకాకుండా తమ కోర్కెలు నెరవేరాలని కోరుకుంటూ రాత్రిళ్లు దర్గాలోనే నిద్ర చేస్తుంటారు. ఈ దర్గా నిర్మాణం వెనుక ఉన్న చరిత్ర గురించి భక్తులు కథలుకథలుగా చెప్పుకుంటూ ఉంటారు.

మొండెంతో యుద్ధం చేసుకుంటూ..

దర్గాకు చెందిన ముజావర్లు కథనం మేరకు... సుమారు 436 ఏళ్ల కిందట హజరత్ గాలిబ్ షహీద్ రహంతుల్లాలై అనే ముస్లిం మతబోధకుడు మతవ్యాప్తి కోసం ప్రచారం చేసుకుంటూ రంగారెడ్డి జిల్లాలోని ఇబ్రహీంపట్నం నుంచి తన అనుచరులతో బయలుదేరాడు. ఈక్రమంలో ఆయా ప్రాంతాల్లో కొందరు శత్రువులు ఆయనతో యుద్ధానికి తలపడతారు. ఆ విధంగా యుద్ధం చేసుకుంటూ విజయవాడలోని కొండపల్లి ఖిల్లాకు చేరుకుంటాడు. అక్కడ జరిగిన యుద్ధంలో శత్రువులు ఆయన తలను నరికేస్తారు. అయినా మొండెంతోనే యుద్ధం చేస్తూ తన అనుచరులతో భవానీపురంలో ఇప్పుడున్న దర్గా ప్రాంతానికి చేరుకుంటారు. ఆ సమయంలో అటుగా వెళుతున్న పాలు, పెరుగు అమ్ముకునే ఒక గొల్లభామ ఆయనను చూసి, తల లేకుండానే ఇంత బాగా యుద్ధం చేస్తున్నాడు... తల ఉంటే ఇంకెంత మందిని చంపేసేవాడోనని మనసులో అనుకుంది. దీంతో ఆమె దిష్టి తగిలిన రహంతుల్లాలై వెంటనే గుర్రంపైనుంచి పడిపోతూ గొల్లభామను నల్లశిలగా మారిపొమ్మని శపిస్తాడు. ఈ నల్లరాయిని కూడా దర్గాలో ఏర్పాటు చేశారు. ఒకసారి ఈ రాయిని ఎత్తుకుపోదామని కొందరు దొంగలు రాయిని కోసేందుకు ప్రయత్నించగా ఆ రాయిలో నుంచి రక్తం రావడంతో దొంగలు భయపడి పారిపోయారట. దొంగలు రాయిని కోసిన గుర్తులు అలానే మిగిలిపోయాయి. రహంతుల్లాలై అనుచరులు కూడా ఇక్కడే బలిదానం చేశారని చెబుతుంటారు. రహంతుల్లాలై మృతికి చిహ్నంగా 'హజరత్ గాలిబ్ షహీద్ దర్గా' పేరుతో మసీదు నిర్మించారు. ఆయన సమాధినే భక్తులు కొలుస్తుంటారు. ఆయన అనుచరుల సమాధులు కూడా ఈ దర్గాలో నిర్మించారు. అప్పటి నుంచి ఏటా ఆయన చనిపోయిన రోజున ఉరుసు మహోత్సవాలను నిర్వహించడం ఆనవాయితీ.

నేడు 437వ ఉరుసు గంధం మహోత్సవం

హజరత్ సయ్యద్ గాలిబ్ షహీద్ (ర.అలై) అవులియావారి 437వ ఉరుసు గంధం మహోత్సవ ఊరేగింపు గురువారం రాత్రి 11.45 గంటలకు ఎండీ సులేమాన్ ముజావర్ ఇంటి వద్ద నుంచి ప్రారంభం అవుతుంది. అక్కడ నుంచి భవానీపురం పురవీధుల గుండా మేళతాళాలు, ఫకీర్ల భక్తి గీతాల నడుమ ముస్లిం మైనార్టీల భక్తిపారవశ్యంతో కోలాహలంగా సాగే ఊరేగింపు శుక్రవారం మధ్యాహ్నం 11.30 గంటలకు దర్గావద్దకు చేరుకుంటుంది. అనంతరం రాత్రి 7గంటలకు దర్గా వద్ద దీపారాధన, అన్నప్రసాద వితరణ జరుగనున్నట్లు దర్గా ముజావర్స్ కమిటీ ఒక ప్రకటనలో తెలిపింది. ఈ ఉరుసు మహోత్సవంలో కులమతాలకు అతీతంగా రాష్ట్ర, రాష్ట్రేతర ప్రాంతాల నుంచి వేలాది మంది పాల్గొని బాబా సమాధిని దర్శించుకుంటారని కమిటీ సభ్యులు తెలిపారు.


దర్గాలోని రహంతుల్లాలై సమాధి

రంజాన్ తోఫా పంపిణీ


రంజాన్ తోఫాను పంపిణీ చేస్తున్న వెలంపల్లి శ్రీనివాసరావు, గౌతమ్‌రెడ్డి తదితరులు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): రంజాన్‌ను పురస్కరించుకుని వైఎస్సార్ సీపీ నాయకులు షేక్ మొహరాజ్, ఆధ్వర్యంలో పేదలకు తోఫా పంపిణీ చేశారు. పలువురికి ఆర్థిక సాయాన్ని అందజేశారు. 48వ డివిజన్ పరిధిలోని మోతీ మసీదు ప్రాంగణంలో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా వైఎస్సార్ సీపీ పశ్చిమ ఇన్‌చార్జి వెలంపల్లి శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు పూనూరు గౌతమ్‌రెడ్డి, జిల్లా వక్ఫ్ బోర్డు మాజీ చైర్మన్ షేక్ గౌస్‌మొహిద్దీన్, దుర్గగుడి మాజీ చైర్మన్ కర్నాటి రాంబాబు హాజరై పేదలకు రంజాన్ తోఫా పంపిణీ చేశారు. పలు మదర్‌సా, మౌలానాలు, ఓ విద్యార్థిని ఉన్నత చదువుల కోసం ఆర్థిక సాయం అందించడం అభినందనీయమన్నారు. పేదవారికి సాయం చేయడమంటే ఆ దేవుడి సేవ చేయడమేనని అతిథులు పేర్కొన్నారు. ఏటా రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని మొహరాజ్, సిరాజ్‌లతోపాటు వారి తండ్రి బాషా చేస్తున్న సేవలు ఆదర్శప్రాయమని కొనియాడారు. పండుగ వేళ ప్రతి ఒక్కరు పేదలకు అండగా ఉంటూ వారికి తగిన రీతిలో సాయాన్ని అందించాలని సూచించారు. తొలుత చిట్టినగర్ మోతీ మసీదు ఇమామ్ నజీర్ అహ్మద్ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు పిళ్లా సూరిబాబు, అయితా కిశోర్, చిచ్చా, నియోజక వర్గ మైనార్టీ అధ్యక్షులు మహ్మద్ అన్వర్ , రషీద్, యూసుబ్, సమీర్, ఖాజా, ఉస్మాన్, వలీ పాల్గొన్నారు.

ఉగాది రోజున అమ్మవారికి గాజుల అలంకరణ

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): విశ్వావసు నామ సంవత్సరాదిని పురస్కరించుకుని 30వ తేదీ ఆదివారం చిట్టినగర్‌లోని శ్రీమహాలక్ష్మీ అమ్మవారికి గాజులతో విశేష అలంకారం చేయనున్నట్లు ఆలయ అర్చకులు ప్రసాద్‌శర్మ తెలిపారు. పండుగ రోజు తెల్లవారుజామున అమ్మవారిని సుమారు లక్ష గాజులతో సౌభాగ్యలక్ష్మీదేవిగా అలంకరిస్తామన్నారు. అలంకారం అనంతరం విశేష అర్చకులు, ప్రత్యేక కుంకుమార్చనలు నిర్వహిస్తామన్నారు. అమ్మవారికి జరిగే విశేష అలంకారం నిమిత్తం అవసరమైన గాజులను భక్తులు విరాళంగా అందచేయవచ్చునని తెలిపారు. అమ్మవారికి అలంకరించిన గాజులను ఉత్సవం అనంతరం భక్తులకు పంపిణీ చేస్తామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. పండుగరోజున అమ్మవారి ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామని వారు వివరించారు.

రేపు హుండీ లెక్కింపు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): కొత్తపేట ఆంజనేయ వాగుసెంటర్‌లో వేంచేసిన శ్రీవీరాంజనేయస్వామి వారికి భక్తులు సమర్పించిన కానుకలను ఈనెల 28వ తేదీ శుక్రవారం లెక్కించనున్నట్లు ఆలయ ఈఓ యడ్లపల్లి సీతారామయ్య తెలిపారు. దేవదాయశాఖ అధికారులు,ఆలయ వంశపారంపర్య ధర్మకర్తలు, రెవెన్యూ, పోలీసు అధికారుల సమక్షంలో కానుకలను లెక్కిస్తామన్నారు. ఆసక్తి గల భక్తులు శుక్రవారం ఉదయం 8 గంటలకు ఆలయ ప్రాంగణానికి రావాలని ఈఓ కోరారు.

30న దక్షిణోత్తరం నృత్య ప్రదర్శన

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో ఉగాది పర్వదినాన దక్షిణోత్తరం ప్రత్యేక నృత్య ప్రదర్శన జరగనుంది. ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలోని కళావేదికపై ఆదివారం సాయంత్రం ఆరుగంటలకు ఈ ప్రత్యేక నృత్య ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు ఆలయ అధికారులు తెలిపారు. సంగీత నాటక అకాడమీ పురస్కార గ్రహీతలు నిరుపమ, రాజేంద్రలు భరతనాట్యం, కథక్ రెండు శాస్త్రీయ నృత్య ప్రక్రియల అద్భుతమైన సంగమాన్ని దక్షిణోత్తరంలో చూడవచ్చునని వివరించారు. బెంగళూరుకు చెందిన అభినవ డ్యాన్స్ సంస్థ ఈ కార్యక్రమాన్ని ప్రదర్శిస్తోందన్నారు. సంగీతాభిమానులు, అమ్మవారి భక్తులు ఈ నృత్య ప్రదర్శనను వీక్షించాలని అధికారులు కోరారు.

6న శ్రీరామ శోభాయాత్ర

విజయవాడ కల్చరల్: శ్రీ రామశోభాయాత్ర సమితి ఆధ్వర్యంలో ఏప్రిల్ 6వ తేదీన నిర్వహించే శ్రీ రామశోభాయాత్రను విజయవంతం చేయాలని తాళ్లాయపాలెం శైవపీఠాధిపతి శివస్వామి పిలుపు నిచ్చారు. గాంధీనగర్‌లోని సంస్థ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆ వివరాలను వెల్లడించారు.

ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించుకోవాలి


అంకమ్మరావును సత్కరిస్తున్న ప్రిన్సిపాల్ శరవణకుమార్

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): విద్యార్థులు ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించుకున్నప్పుడే జీవితంలో మరిన్ని విజయాలను అందుకుంటారని పొట్టిశ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.శరవణకుమార్ పేర్కొన్నారు. కళాశాల మేనేజమెంట్ స్టడీస్ ఆధ్వర్యంలో 'స్వీయ నమ్మకం నిర్మాణం-వ్యక్తిగత భద్రతను పెంపొందించుకోవడం' అనేఅంశంపై మూడు రోజులుగా నిర్వహిస్తున్న వర్క్‌షాప్ బుధవారం ముగిసింది. ఈ సందర్భంగా ముఖ్యఅతిథి శరవణకుమార్ మాట్లాడుతూ విద్యార్థులు విద్యతోపాటు ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించే కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ముఖ్యవక్తగా హాజరైన తైక్వాండో జిల్లా కార్యదర్శి ఎం.అంకమ్మరావు మాట్లాడుతూ అత్యవసర పరిస్థితుల్లో విద్యార్థులు ధైర్యంగా ముందుకు సాగాలన్నారు. తైక్వాండో తదితర అంశాలపై పట్టు సాధించాలన్నారు. ఐసీసీ కన్వీనర్ డాక్టర్ రమాదేవి మాట్లాడుతూ విద్యార్థులు వ్యక్తిత్వ వికాసం, ఆత్మవిశ్వాసం, సమయస్ఫూర్తి తదితర అంశాలపై నిర్వహించే కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆయా విభాగాల అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

అవుట్ ఫాల్ డ్రెయిన్ పనులు పూర్తి చేయండి

వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర


కృష్ణవేణి రోడ్డులో అధికారులకు సూచనలు ఇస్తున్న వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర

పటమట(విజయవాడతూర్పు): నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న అవుట్ ఫాల్ డ్రెయిన్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. నగర పర్యటనలో భాగంగా ఆయన బుధవారం ఉదయం టిక్కిల్ రోడ్, పిన్నమనేని పాలీ క్లినిక్ రోడ్, కృష్ణవేణి రోడ్, పటమట ప్రాంతాలలో పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఆయా ప్రాంతాల్లో జరుగుతున్న నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తిచేసి త్వరలో అందుబాటులోకి తీసుకురావాలని, రానున్న వర్షాకాలంలో, వర్షపు నీటి నిల్వలు రోడ్డు మీద నిల్వ ఉండకుండా సైడు కాలువల్లో నీరు నిరంతరం ప్రవహించేలా అధికారులు ఎప్పటికప్పుడు డీసిల్టింగ్ పనులు చేపట్టాలని అధికారులకు సూచించారు. అనంతరం ఆయన పటమట హైస్కూల్ రోడ్డులోని అన్న క్యాంటీన్‌ను పరిశీలించారు. పారిశుద్ధ్య నిర్వహణలో ఎలాంటి లోపం లేకుండా చర్యలు తీసుకోవాలని, కిచెన్లో ఆరోగ్యకరమైన వాతావరణాన్ని ఉండేలా నిరంతరం పర్యవేక్షిస్తుండాలని అన్నారు. జోనల్ కమిషనర్ కె. షమ్మీ, ఇన్‌చార్జి చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సురేష్ బాబు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సామ్రాజ్యం, తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా 'ఇన్‌కెండో-2కే25'


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న సౌమ్య

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): తరగతి గదిలో విద్యార్థులు చదువుకున్న అంశాలు మార్కెట్‌లోని అవసరాలను తీర్చేవిధంగా ఉండాలని ఎస్‌జీఎస్‌టీ స్పెషల్ కమిషనర్ నూతులపాటి సౌమ్య సూచించారు. సిద్ధార్థ కళాశాల కామర్స్ విభాగం ఆధ్వర్యంలో ఇన్‌కెండో-2కే25 పేరుతో సిద్ధార్థ ఆడిటోరియంలో కామర్స్ విద్యార్థులకు పోటీలు బుధవారం జరిగాయి. సౌమ్య ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ పాఠ్యపుస్తకాల్లో చదువుకున్న అంశాలను బయట మార్కెట్‌లో ఉన్న అంశాలను జోడించి పరిష్కారాలను ఆవిష్కరించాలని సౌమ్య పేర్కొన్నారు. ఇలాంటి కార్యక్రమాల్లో పాల్గొనడం ద్వారా యువత తమలోని నైపుణ్యాలను, కమ్యూనికేషన్ స్కిల్స్ పెంపొందుతాయని చెప్పారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎం.రమేష్ మాట్లాడుతూ పాఠ్యపుస్తకాల్లో ఉన్న పాఠాలను చదివి రాస్తే, పరీక్షల్లో మార్కులు వస్తాయని, వాటితో పాటుగా సమాజంలో ఉన్న సమస్యలను యువత నిశితంగా పరిశించి చదువుకున్న జ్ఞానంతో పరిష్కారాలను కనుగొనాలని సూచించారు. కళాశాల డీన్ రాజేష్ సి.జంపాల మాట్లాడుతూ కామర్స్ కోర్సును అభ్యసించిన వారికి ఉపాధి అవకాశాలు మెరుగ్గా ఉన్నాయని చెప్పారు. సిద్ధార్థ కళాశాల కామర్స్ విభాగాధిపతి కోన నారాయణరావు మాట్లాడుతూ విద్యార్థుల్లో ఉన్న సృజనాత్మకతను వెలికితీయడానికి తమ కళాశాల ఆధ్వర్యంలో ఏటా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని చెప్పారు.

ఉత్సాహంగా సాంస్కృతిక పోటీలు..

సభ అనంతరం నిర్వహించిన పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. నగరంలోని కళాశాలతో పాటుగా గుంటూరు, తెనాలిలోని కళాశాలల విద్యార్థులు తమ ప్రతిభ కనబరిచారు. క్విజ్, దలాల్ స్ట్రీట్, మైండ్ ఇట్, ఫైనాన్సియల్ అనలిస్ట్, ఐపీఎల్ పోటీలతో పాటుగా మిస్టర్ అండ్ మిస్ ఇన్‌కెండో-2కే25 పేరుతో నిర్వహించిన ఫ్యాషన్ షో, గ్రూప్ డ్యాన్స్ పోటీల్లో విద్యార్థులు సత్తా చాటారు.

జూనియర్ సాఫ్ట్‌వేర్ డెవలపర్ కోర్సుకు దరఖాస్తులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యాన నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకుగానూ మాచవరం ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జూనియర్ సాఫ్ట్‌వేర్ డెవలపర్ కోర్సులో ఉచిత శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. భాగ్యలక్ష్మి బుధవారం ఓ ప్రకటనలో కోరారు. ఇంటర్, డిప్లొమా, ఏదైనా డిగ్రీ అర్హతగల వారికి ప్రత్యేకంగా 3నెలలపాటు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. మరింత సమాచారం కోసం సెల్‌నంబరు77996 69907లో సంప్రదించాలని సూచించారు.




● ఆత్మీయతా.. ఆధ్యాత్మికత

పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని ముస్లింలకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇఫ్తార్ విందును ఏర్పాటు చేసింది. పార్టీ జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్ ఆధ్వర్యంలో నగరంలోని ఎస్‌ఏసీ కల్యాణ మండపంలో బుధవారం నిర్వహించిన ఈ కార్యక్రమానికి మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హాజరయ్యారు. పెద్ద ఎత్తున హాజరైన ముస్లింలతో కలిసి ఆయన నమాజు చేసి, ఇఫ్తార్ స్వీకరించారు. ఈ సందర్భంగా గురునానక్‌కాలనీ పరిసర ప్రాంతాలన్నీ జన సందోహంతో కిక్కిరిశాయి. జై జగన్ నినాదాలతో హోరెత్తాయి. కార్యక్రమం ముగించుకొని ఆయన తిరిగి వెళ్లే వరకూ రోడ్లన్నీ 'జన'మయమై దర్శనమిచ్చాయి. – సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ






సమస్యపై హైవే ఉన్నతాధికారులతో చర్చిస్తాం


అధికారులతో మాట్లాడుతున్న కార్పొరేటర్లు రామిరెడ్డి, వెంకట సత్యనారాయణ

కృష్ణలంక(విజయవాడతూర్పు): రాణిగారితోటలో జాతీయ రహదారిపై నేతాజీ వంతెన జంక్షన్‌లో రోడ్డు ప్రమాదాల నివారణకు నేషనల్ హైవే అధికారులతో చర్చించి చర్యలు తీసుకుంటామని వీఎంసీ సీఈ శ్రీనాథ్‌రెడ్డి అన్నారు. రాణీగారితోట ప్రజలు రోజుకు సుమారు 20 వేల మంది జాతీయ రహదారి దాటుతుంటారని, దాటే సమయంలో ప్రమాదాలు జరిగి మృతి చెందుతున్నారని, అండర్‌పాస్ నిర్మించి ప్రమాదాలను అరికట్టాలని మంగళవారం జరిగిన వీఎంసీ కౌన్సిల్‌లో 17వ డివిజన్ కార్పొరేటర్ తంగిరాల రామిరెడ్డి ప్రతిపాదన పెట్టారు. గతంలో మూడుసార్లు ప్రతిపాదన పెట్టానని, ఇప్పటివరకు అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. వెంటనే ఆ ప్రాంతాన్ని పరిశీలించాలన్న కమిషనర్ ఆదేశాల మేరకు బుధవారం వీఎంసీ సీఈ శ్రీనాథ్‌రెడ్డి, ఈఈ సామ్రాజ్యం, వెంకటేశ్వరరెడ్డి, ఎస్ఈ సత్యకు మారి, ఏఈ నాగసాయి, ట్రాఫిక్ సీఐ బాల మురళీకృష్ణలతో పాటు ఎన్‌హెచ్ఐ ఇంజినీర్ నాగేశ్వరరావుతో కలిసి నేతాజీ వంతెన జంక్షన్‌ను పరిశీలించారు.

జంక్షన్‌లో సిగ్నల్ లైట్లు ఏర్పాటు చేయండి..

ఈ సందర్భంగా 17, 18 డివిజన్ల కార్పొరేటర్లు తంగిరాల రామిరెడ్డి, వెంకటసత్యనారాయణ మాట్లాడుతూ నేతాజీ వంతెన జంక్షన్‌లో అండర్‌పాస్ నిర్మించాలని, లేనిపక్షంలో సిగ్నల్ లైట్లు ఏర్పాటు చేసి బారికేట్లు తెరవాలని ఇంజినీరింగ్ అధికారులను కోరారు.

పాలిసెట్‌కు ఉచిత శిక్షణ

మధురానగర్(విజయవాడసెంట్రల్): విద్యార్థులు ఉచిత పాలిటెక్నిక్ కోచింగ్ సేవలను సద్వినియోగం చేసుకుని మంచి ర్యాంకు సాధించాలని ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. భాగ్యలక్ష్మి సూచించారు. స్థానిక మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన ఉచిత పాలిటెక్నిక్ కోచింగ్ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని ఎస్ఎఫ్ఐ నేతలతో కలిసి ఉచిత పాలిటెక్నిక్ కోచింగ్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఎస్ఎఫ్ఐ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి సీహెచ్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పదో తరగతి పరీక్షలు రాసి పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష కోసం సిద్ధమవుతున్న విద్యార్థులకు భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో ఏప్రిల్ 3వ తేదీ నుంచి ఉచిత కోచింగ్ ఏర్పాటు చేశామన్నారు. ప్రతి రోజు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు నిష్ణాతులైన అధ్యాపకులచే శిక్షణ ఇస్తామన్నారు. ఈ కోచింగ్ కు ఏటా 250 మంది పైగా విద్యార్థులు హాజరు అవుతున్నారని.. వారికి దాతల సహకారంతో ఉచితంగా స్టడీ మెటీరియల్స్ కుడా అందిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నగర అధ్యక్ష, కార్యదర్శులు మాధవ్, కుమార్ స్వామి, నగర నాయకులు తదితరులు పాల్గొన్నారు.